
# చీడ

**-ఎస్. జయ్‌వీర్**



**సత్యనారాయణ భార్య బావురుమంటోంది. నిన్న సాయంత్రమనగా వెళ్ళిన సత్యనారాయణ ఇంతవరకూ తిరిగిరాలేదు. చూరులో పెట్టిన ఎరువుల మందు కనిపించడంలేదు. పొలమంతా కలియతిరిగింది. జనాన్ని వెంటపెట్టుకొని ఊరు చుట్టూ తిరిగి వచ్చింది. రెండ్రోజుల తర్వాత ఎక్కడో ఆత్మహత్య చేసుకుని ఉంటాడు అని కొందరన్నారు. లేదు - విప్లవమంటే ముందు నుంచీ సత్యనారాయణకు ఉత్సాహం ఉండేది. వాళ్ళలో కలిసాడట అని కొందరన్నారు.**

'ఇక లాభం లేదు. మళ్ళీ పురుగులు మందు వేయాల్సిందే. వరంగల్‌కు పోయి వస్తాను' అంటూ సత్యనారాయణ బ్యాగు సర్దుకుని బస్టాండ్ వైపు వెళ్ళిపోయాడు.

నాలుగెకరాల పత్తిరైతు సత్యనారాయణ. భూమిని నమ్ముకుని బతుకుతున్నాడే కానీ ఏ రోజూ ఆ భూమి కడుపునిండా అన్నం పెట్టిన దాఖలాలు మాత్రం లేవు. సత్యనారాయణ తండ్రి ఇంకా పెద్ద రైతు. ఆయన చుట్టూ పదిమంది జనం ఎప్పుడూ ఏదో ఒక సహాయం కోసం ఉండేవాళ్ళని ఊళ్ళో ఇప్పటికీ అనుకుంటుంటారు. నమ్ముకున్న భూమినే అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం నాలుగు సంవత్సరాలుగా అందరూ పత్తి వేస్తుంటే నలుగురితోపాటు నారాయణ అని సత్యనారాయణ కూడా పత్తే వేశాడు. ఉన్న నాలుగెకరాల్లో వేసింది రెండెకరాల్లోనే. మొదటి సంవత్సరం ఎకరాకు ఐదు క్వింటాళ్ళొచ్చింది. అప్పుడు ధర రెండు వేల నుంచీ రెండువేల రెండొందల దాకా నడిచింది. ఇదేదో బాగానే ఉందని అనుకున్నాడు. రెండో సంవత్సరంలో వచ్చింది సమస్య. విత్తనాల ధరలు పెరిగిపోయాయి. వంద, వందా పాతిక... ఇలా రేట్లు పెరిగి పెరిగి ఎకరాకు సరిపోయే విత్తనాల ప్యాకెట్టు ఒకేసారి మూడొందల పైచిలుకుకు అమ్ముడుపోయింది. పత్తి విత్తనాల వ్యాపారం చేయని వాడు పాపాత్ముడన్నట్లు అందరూ ఇందులో కాలు మోపడంతో బ్లాక్ మార్కెటింగ్ కూడా జోరందుకుంది. ఈసారి పండిన పంటకు క్వింటాలు ధర పదహారు వందల నుంచీ పందొమ్మిది వందలకు మించడం లేదు. పోయినసారి కిరాయి స్ప్రేయర్‌తో మందు వేస్తే ఈసారి మాత్రం వ్యవసాయం అన్నాక తప్పదు కదాని మూడువేల ఐదువందలు పెట్టి సత్యనారాయణ స్ప్రేయర్ కొన్నాడు.

విత్తనాలు దొరకవేమో అనుకున్నారు కానీ ఊరూరా అమ్మకందార్లు ఉండటంతో సత్యనారాయణ ఎన్నికల్లో సీటు సంపాదించినంత కంటే కష్టంగా పత్తి విత్తనాలను సంపాదించాడు. ఇక్కడ నుంచీ మొదలయ్యాయి కష్టాలు.

రోహిణీకార్తెలో వర్షాలు పడగానే విత్తనాలు వేయడం అయ్యింది. ఏదీ - మళ్ళీ ఒక వర్షమైనా వస్తే కదా? మొలిచిన మొక్కలు అదే భూమిలో కలిసిపోయాయి. రైతులందరూ తలలు పట్టుకుని కూర్చున్నారు. గత్యంతరం లేక ఆరుద్రకార్తెలో అందరితోపాటు తను కూడా రెండోసారి విత్తనాలు వేశాడు. రెండోసారి విత్తనాలు వేసింది మొదలు సత్యనారాయణకు సొంత బోరులేని సమస్య పుండులా సలుపుతోంది. మళ్ళీ అప్పు చేయాలి. ఎవరి దగ్గరకెళ్ళాలి? అయినా తప్పదు కదా అనుకుంటూ ముందు జియాలజిస్టును కలిశాడు. ఓ ఐదువందల అడ్వాన్స్ తీసుకుని డేటు ఇచ్చి వస్తాను పొమ్మన్నాడు జియాలజిస్టు. సరే - వచ్చాడు. ఆయనకు ఎండ తగలకుండా ఒకరు గొడుగు పడుతుంటే ఇంకొకరేమో విజిల్ ఊదుతూ హడావుడి. మొత్తం మీద ఓ పాయింట్ చూపి బ్యాలెన్స్ ఐదు వందలు తీసుకుని వెళ్ళిపోయాడు.

శుభముహూర్తాన బోర్ వేస్తే ఇసక తప్ప ఏమీ పడలేదు. ఏడువేల రూపాయల చేతి చమురు వదిలింది సత్యనారాయణకు. ఈసారి ఇది లాభం లేదనుకుని తంగేడు, పులిచేరు, టెంకాయ వైద్యుల్ని ఆశ్రయించాడు. దానికంటే ఇదే నయమనిపించింది. రెండంగుళాల నీళ్ళు పడ్డాయి. దానికో ఏడువేలు పోయిన బాధ ఈ రెండంగుళాల నీళ్ళతో తీరింది కానీ ఇంకో తొమ్మిదివేలు నెత్తిన పడింది. పోతే పోయింది నీళ్ళొచ్చాయి. అదే అదృష్టం అనుకున్నాడు. ఇంక మోటార్‌కొచ్చింది. కరెంటు వారి చుట్టూ ఎన్ని రోజులు తిరిగాడో సత్యనారాయణకే గుర్తులేదు. ఒక్కో పంట ఒక్కో విషాదాన్ని మిగిలిస్తున్నా ఈ జూదం తప్ప తనలాంటి రైతులకు ఇంకో ఆట రాదనుకుని ఎలాగో మోటరు సంపాదించాడు. మోటరు ఆన్‌చేసి పంటకు నీళ్ళు తిప్పుతుంటే పత్తికాయలు విచ్చుకునే కలలెన్నో పగటిపూటే కన్నాడు.

★ ★ ★

బస్సు ఒక్క కుదుపు కుదిపింది. 'సత్యం సత్యం' అని ఎవరో పిలిచారు. సత్యం ఉన్నదే దాదాపు వెనక సీటు. చివరి సీటులో ఉన్న సుధాకర్ పిలిచినట్టు గమనించాడు. ఎప్పుడో స్కూల్లో క్లాస్‌మేట్. ఇద్దరికీ చనువెక్కువ. చివరి సీటు నుంచి ముందుకు ఎవరైనా రమ్మంటే వస్తారు కానీ ఇక్కడ్నుంచి వెనక్కు మాత్రం వెళ్ళరు. తను వెనక్కు వెళ్ళి సుధాకర్ పక్కన సీట్లో ఉన్నతనికి తన సీటు ఇచ్చాడు. సుధాకర్‌కు లోకమంతా కావాలి. చదువుకున్నా తనలాగే అతనూ రైతు.

'వరంగల్‌కేనా?' అడిగాడు సుధాకర్.

'ఇంకెక్కడి పోయేటట్టుంది? వరంగల్‌కే- పత్తి పురుగుతోనే వస్తోంది. అసలే మాత్రం కంట్రోల్ కావడంలేదు. పేరుకు పురుగుల మందంటారు కానీ మనం చావాల్సిందే' బాధో, ఆవేదనో, వ్యంగ్యమో అర్థంకానట్టు అన్నాడు.

'నాదీ అదే పరిస్థితి. మందుకే బయల్దేరాను. రెండుసార్లు బోర్ వేసినా లెక్కలే ఇంతవరకూ తేలలేదు. అప్పుకు వడ్డీ - వడ్డీకి అప్పులాగా అయిపోయింది. ఆ మధ్య అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌వాళ్ళు ఏదో చెప్పారు. వాళ్ళ గోల వాళ్ళది. షాపుల వాళ్ళ గోల షాపుల వాళ్ళది.' అంటూ ఎంతసేపు మాట్లాడినా ఇదే గోల కదా అని లోకాభిరామాయణంలోకి విషయాన్ని తిప్పాడు.

'నీ పరిస్థితేమోగానీ మందు కల్తీ కంటే నాది విత్తనం కల్తీనే ఎక్కువ' అంటూ సుధాకర్ అసలుకే మోసం జరిగిన విషయం చాలా బాధతో చెప్పాడు. మాటల్లో వరంగల్ వచ్చేసింది.

సుధాకర్, సత్యనారాయణ ఎవరి దారి వాళ్ళు చూసుకున్నారు.

★ ★ ★

మందుల దుకాణంలో చీటీ తీసి ఇచ్చాడు సత్యనారాయణ.

అల్యూమినియం డబ్బా ఒకటి తెచ్చిచ్చాడు షాపతను.

'ఈ మందు వద్దు. నాకు క్వినాల్‌ఫాస్ కావాలి' అంటూ గట్టిగా అన్నాడు సత్యనారాయణ.

'అది ధర ఎక్కువ - అయినా స్టాక్ లేదు - ఇది తక్షణంగా పనిచేస్తుంది. ఫస్ట్‌క్లాస్ మందు. ఇప్పటికే పదికేసులు అమ్మేశాం. ఏం ఫర్వాలేదు తీసుకెళ్ళు' అన్నాడు షాపతను.

'అయితే నాకిది వద్దు. క్వినాల్‌ఫాస్ దొరికే చోటుకే వెళతాను' అంటూ వెనుదిరగబోయాడు సత్యనారాయణ.

'అయ్యా బాబూ ఇదే మంచిది. పెద్ద కంపెనీ పేరు పెట్టుకుని ఓ వంద రూపాయలు ఎక్కువ కొట్టేస్తే తప్ప మీకు నమ్మకం ఉండదు. ఎవరు చెప్పారయ్యా అది కొనమని' అంటూ విసురుగా అడిగాడు షాపతను.

'వ్యవసాయ పంచాంగంలో ఇచ్చారు' అన్నాడు సత్యనారాయణ.

'పంచాంగాల్లో అలాగే ఇస్తారు. వాళ్ళకు తెలుసా? అమ్మేవాళ్ళం మాకు తెలుసా? రోజుకో రోగం వస్తుంటే ఎన్ని మందులని వస్తాయ్' అని ఇంకా ఏదో అతను నసుగుతూనే ఉన్నాడు.

సత్యనారాయణ మరో దుకాణానికి వెళ్లి క్వినాల్‌ఫాస్ కొన్నాడు. మరునాడు మధ్యాహ్నం పత్తి చేలో స్ప్రే చేస్తుండగా సుధాకర్‌కు సత్యనారాయణకు సన్నిహిత మిత్రుడైన రామకృష్ణ చేలోకి పరుగు పరుగున వస్తున్నాడు.

'సత్యం సత్యం... నీకు తెలుసా? సుధాకర్ ఆత్మహత్య చేసుకున్నాడట' అన్నాడు రామకృష్ణ. అంతే - ఇంకా బస్సులో పక్కనే కూర్చుని మాట్లాడుతున్న దృశ్యాలే సత్యనారాయణ ముందు కదిలాయి. సుధాకర్ అంత్యక్రియలు పూర్తయ్యేవరకు దగ్గరుండి కన్నీళ్ళ పర్యంతమై గంపంత దిగులుతో వచ్చేశాడు.

ఇంటికి వచ్చాడే కానీ సత్యనారాయణకు మనసులో మనసు లేదు. ఆ మరుసటిరోజే పేపర్లో మొదటి పేజీలో ఎక్కడెక్కడో రైతులు ఆత్మహత్యలు చేసుకున్న వార్తలు వికృతంగా ఉన్నాయి. ఆ మాత్రం ధైర్యం లేకపోతే ఎలా? వ్యవసాయం అన్నాక జూదం లాంటిది. సుధాకర్ ఎందరికో సలహాలిచ్చేవాడు. ఎందుకిలా చేసుకున్నాడు? అన్న బాధ సత్యనారాయణను వెంటాడింది.

పత్తి ధరలు ఆటుపోట్లలా ఉన్నాయట. అసలేమవుతుందో తెలీదు. ఇప్పుడు నడుస్తున్న ధర రేపుంటుందన్న నమ్మకం కూడా లేదు. ధరలో తరుగుదలే కానీ ఏ మాత్రం పెరిగే సూచనలు లేవు. ఎరువుల దుకాణం, మందుల దుకాణం పచ్చగానే ఉంటాయి. మోడుబారి పోతున్నది రైతులే. పేపర్లలో, టీవీలలో ఏవేవో వార్తలు, వ్యాఖ్యలు వస్తున్నాయి. సత్యనారాయణకు అంతా గందరగోళంగా ఉంది. చేసిన అప్పెంత? దానికైన వడ్డీ ఎంత? ఎంత హీనంగా లెక్కవేసినా తన దిగుబడికి వచ్చే డబ్బెంత? పోతే ఎంత అప్పు మిగులుతుంది? నెలనెలా వడ్డీ కట్టాలంటే ఎలా వీలవుతుంది? అన్న ప్రశ్నలే వేధిస్తున్నాయి. మామూలుగా అయితే సత్యనారాయణ బెదిరే రకం కాదు. వాళ్ళ ఊళ్ళోనే మోతుబరి రైతులుగా ఒకప్పుడు మీసం మెలిపెట్టినవారు పత్తికి తెచ్చిన మందులు తాగి చేలోనే తలవాల్చారు. రోజురోజుకు సత్యనారాయణలో వడ్డీల వ్యవహారం కళ్ళ ముందు కదులుతోందే కానీ పంట దిగుబడి మీద దృష్టి తగ్గిపోయింది.

'ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి లక్ష రూపాయలట. వీలైతే ఆ కుటుంబంలో ఎవరికైనా ఉద్యోగమట. బతికి సాధించేదేముంది? పోతే ఇంట్లో వాళ్ళకు లక్ష డబ్బు, వస్తే ఓ ఉద్యోగం కూడా. ఆత్మహత్యే మంచిదేమో? ఏమంటావ్?' అని ఎవరో అంటున్నారు.

బతికేం సాధించాలని సత్యనారాయణ అలా అన్నవారికి సమాధానం చెప్పాలని ఉంది కానీ మాట రాలేదు. పంట చేతికొచ్చే దశలో చీడ పడుతోంది. మళ్ళీ స్ప్రే వేయాలేమో? పేపర్ల నిండా పత్తిరైతుల గొడవలే. ప్రతిపక్షాలు అరచి గోల పెడుతున్నాయి. పాలకపక్షం కేంద్ర సాయం కోసం కూడా అభ్యర్థిస్తోంది. ఒకరూ ఇద్దరూ రోజుకు ఐదారుగురు రైతులు చనిపోతున్నారు. వచ్చిన ప్రతి ఆఫీసర్‌ను రైతులు కలిసి ప్రాధేయపడుతున్నారు. ఎవరెవరి నివేదికలు ఎలా ఉన్నాయో రైతులకు తెలీదు. ఉద్యమాలు ఊపందుకుంటున్నాయి. కానీ జరుగుతున్నది ఏమీ లేదు. బ్యాంకులు, కరెంటు, మందుల దుకాణాలు, అధికార్లు, ప్రతినిధులు - ఎవరిని నమ్మాలి? ఎవరి దగ్గర ఎలా మాట్లాడాలి? ఎవరు ఎందుకోసం వస్తున్నారు? సహాయం చేస్తారా? లేక వాళ్ళకు పనికొచ్చే వస్తువులుగా రైతు సమస్యలను వాడుకుంటారా? ఏమో?...

★ ★ ★

సత్యనారాయణ భార్య బావురుమంటోంది. నిన్న సాయంత్రమనగా వెళ్ళిన సత్యనారాయణ ఇంతవరకూ తిరిగిరాలేదు. చూరులో పెట్టిన ఎరువుల మందు కనిపించడంలేదు. పొలమంతా కలియతిరిగింది. జనాన్ని వెంటపెట్టుకొని ఊరు చుట్టూ తిరిగి వచ్చింది. రెండ్రోజుల తర్వాత ఎక్కడో ఆత్మహత్య చేసుకుని ఉంటాడు అని కొందరన్నారు. లేదూ - విప్లవమంటే ముందు నుంచీ సత్యనారాయణకు ఉత్సాహం ఉండేది. వాళ్ళలో కలిసాడట అని కొందరన్నారు. శవం దొరకలేదు కానీ సత్యనారాయణ చుట్టూ అల్లుకున్న కథలు ఆయన భార్యను జీవచ్ఛవంగా మార్చాయి. పంటను పురుగు వేస్తే మందు వేస్తారు. మందులనే పురుగు మేస్తే ఏం వేయాలి? ఈ చీడకు ఏదీ విరగడ?

★